సాక్షి
నిర్మల్
మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023

ఎవరెస్ట్ వైపు తొలి అడుగు..



ఆశయ సాధనకు పేదరికం అడ్డుకాదని నిరుపిస్తున్నాడు.. కుమురం భీం జిల్లా కెలి కె గ్రామానికి చెందిన గిత్తే కార్తీక్. ఎవరెస్ట్ అధిరోహించడ లక్ష్యంగా సిక్కింలో నిర్వహించే శిక్షణకు ఎంపికయ్యాడు.

8లో▸

18న వినాయక చవితి

నిర్మల్‌చైన్‌గేట్: బ్రాహ్మణోత్తములు, వేద పండితులు నిర్ణయించిన ప్రకారం ఈనెల18 సోమవారం వినాయక చవితి జరుపుకోవాలని విశ్వ హిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు పతికే రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ విషయంలో ఎటువంటి సందేహం లేకుండా హిందూ బంధువులందరూ ఈ నెల 18న వినా యక విగ్రహాలు ప్రతిష్టించి 28న అనంత చతుర్ధశి రోజు నిమజ్జనం చేయాలన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.3 /24.2

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

రోడ్లపై నెత్తుటి చారలు!

- మత్తు.. అతివేగంతో ప్రమాదాలు..
- 'ఎన్‌హెచ్'పై వరుస యాక్సిడెంట్లు
- నెల వ్యవధిలోనే పలు ఘటనలు
- తాజాగా బోల్తాపడిన మరో బస్సు



ఆగస్టు 27న చిట్యాల బ్రిడ్జి వద్ద ఢీకొన్న డీసీఎం, లారీలు

నిర్మల్: జిల్లాలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదం జరుగుతూనే ఉంది. ఎక్కువగా ఎన్‌హెచ్ 44, 63పైనే జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలు కూడా వేకువజామున నిద్రమత్తులో లేదంటే మద్యం మత్తులోనే అవుతున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. నెలరోజుల్లోనే పదికిపైగా ప్రమాదాలు జరిగాయి. మామడ మండలంలో టిప్పర్‌ను లారీ ఢీకొట్టి ముగ్గురి ప్రాణాలను బలిగొన్న ఘటన మరువకముందే సోమవారం వేకువజామున నిర్మల్‌రూరల్ మండలంలో ఓ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు.

ఆ రెండు రోడ్లపైనే..

జిల్లాలో ప్రధానంగా ఉన్నవే రెండు రోడ్లు. ఒకటి భైంసా–మంచిర్యాల 63వ నంబర్ జాతీయ రహదారి. రెండోది హైదరాబాద్ నుంచి జిల్లా మీదుగా నాగపూర్ వెళ్లే ఎన్‌హెచ్ 44. జిల్లాకేంద్రం మీదుగా వెళ్లే ఈ రెండు రోడ్లే జిల్లా మొత్తం రవాణా వ్యవస్థకు, రాకపోకలకు ఆధారం. వీటిపైనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్ల నిర్మాణాల్లోనూ లోపాలు ఉన్నాయన్న వాదనలు ఉన్నాయి. నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్లే ఎన్‌హెచ్ 44 బైపాస్ రోడ్డుపై ఇప్పటి వరకు పదులసంఖ్యలో ప్రమాదాలు జరిగాయి. జిల్లా పొడవునా గల ఎన్‌హెచ్ 63పైనా ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. రెండు లైన్ల రోడ్డు కావడం, ట్రాఫిక్ పెరగడం, చాలాచోట్ల ప్రమాదకరంగా ఉండటంతో తరచూ యాక్సిడెంట్లు జరుగుతున్నాయి.

రెప్ప వాలినా అంతే..

జిల్లా మీదుగా వెళ్తున్న ఎన్‌హెచ్ 44పై జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువగా వేకువజామునే ఉంటున్నాయి. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వెళ్లే ఈ మార్గంలో భారీ వాహనాలు వందల కిలోమీటర్లు ప్రయాణం చేస్తూనే ఉంటాయి. కొంతమంది డ్రైవర్లు త్వరగా గమ్యాన్ని చేరాలన్న ఉద్దేశంతో రాత్రిళ్లు విశ్రాంతి తీసుకోకుండా ప్రయాణిస్తుంటారు. ఇదే ప్రాణాల మీదుకు వస్తోంది. వేకువజామున ముంచుకొచ్చే నిద్రమత్తులో కనురెప్ప వాలినా అంతే. తాజాగా సోమవారం బెంగళూరు వెళ్తున్న యూపీ బస్సు బోల్తాపడటంలోనూ నిద్ర మత్తు ప్రభావం ఉన్నట్లు తెలుస్తోంది. నిద్రతోపాటు మద్యం మత్తులో, అతివేగం, అజాగ్రత్తల కారణంగానూ జిల్లాలో రోడ్లు తరచూ రక్తమోడుతున్నాయి. రాత్రిళ్లు మద్యం సేవించి, ఎక్కడా విశ్రాంతి తీసుకోకుండా వచ్చే భారీ వాహనాలు సరిగ్గా వేకువజామున బోల్తా కొట్టడమో లేక మరో వాహనాన్ని ఢీకొట్టడమో జరుగుతోంది. గమ్యాన్ని త్వరగా చేరుకోవాలన్న ఆత్రుతతో అతివేగంగా వాహనాన్ని నడిపించడం, అనుకోకుండా మధ్యలో ఏదైనా అడ్డువచ్చినప్పుడు వాహనం అదుపుతప్పడం ప్రమాదాలకు కారణమవుతోంది. వీటికితోడు జిల్లాలోకి జాతీయ రహదారులు కొన్నిచోట్ల పల్లంగా ఉండటం, ప్రమాదకరంగా మూలమలుపులతోనూ యాక్సిడెంట్లు జరుగుతున్నాయి.

నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు..



జిల్లాలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. శాఖాపరంగా చాలావరకు డ్రంకెన్‌డ్రైవ్, వాహనాల తనిఖీలు చేపడుతున్నాం. కానీ.. అతివేగం, అజాగ్రత్త, నిర్లక్ష్యంతోనే ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికదూరం ప్రయాణం చేసే డ్రైవర్లు కచ్చితంగా విశ్రాంతి తీసుకోవాలి. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రాణాలమీదకు వస్తుంది. వ్యక్తిగతంగా రోడ్డుభద్రత నిబంధనలను పాటించాలి.

– ప్రవీణ్‌కుమార్, ఎస్పీ

నెల వ్యవధిలోనే..

జిల్లాలో నెలరోజుల వ్యవధిలోనే పలుచోట్ల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోగా, చాలామంది క్షతగాత్రులయ్యారు.

- ఆగస్టు 23న తానూరు మండలం కోలూరు నుంచి వస్తుండగా బైక్ అదుపుతప్పి పడిపోవడంతో కుభీర్ మండలం రంజినికి చెందిన నవీన్, యోగేశ్ అనే యువకులకు తీవ్రగాయాలయ్యాయి.
- సరిగ్గా స్వాతంత్య్ర దినోత్సవమైన ఆగస్టు 15నే జిల్లాకేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. బోథ్ మండలం ధన్నూరుకు చెందిన రాజారం హరీశ్ తన ఇద్దరు మిత్రులతో కలిసి బైక్‌పై నిర్మల్ బస్టాండ్‌వైపు వస్తుండగా ఎదురుగా ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈప్రమాదంలో హరీశ్ అక్కడికక్కడే మృతిచెందగా, గంగయ్య, పవన్‌కు తీవ్రగాయాలయ్యాయి.
- ఆగస్టు 23నే ఎన్‌హెచ్ 63పై నిర్మల్ ఈద్గాం వద్ద తన భర్తతో కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తున్న మహాత్మజ్యోతిబాపూలే కళాశాల గెస్ట్ లెక్చరర్ శివలింగు శ్రీజ దుర్మరణం పాలైంది. వీరి బైక్‌ను వెనుకనుంచి బొలేరో వాహనం ఢీకొట్టడంతో మూడునెలల గర్భిణి అయిన శ్రీజ మృత్యువాత పడింది.
- ఆగస్టు 27న మామడ మండలం పులిమడుగు సమీపంలో ఎన్‌హెచ్ 44పై టిప్పర్ ద్వారా రోడ్డుపక్కన గుంతల మరమ్మతులు చేస్తుండగా మృత్యువు దూసుకొచ్చింది. ఆదిలాబాద్ నుంచి నిర్మల్‌వైపు వేగంగా వెళ్తున్న లారీ రోడ్డుపక్కన ఉన్న టిప్పర్‌ను బలంగా ఢీకొట్టింది. టిప్పర్ బోల్తాపడటంతో డ్రైవర్ లాల్‌సింగ్, అందులోని కుమ్రం రాజేంద్రప్రసాద్, ప్రమాదానికి కారణమైన లారీ క్లీనర్ షేక్‌ఖాసీం మృతిచెందారు.
- ఆగస్టు 27నే మరో బీభత్సం చోటుచేసుకుంది. నిర్మల్‌రూరల్ మండలం చిట్యాలలో స్వర్ణవాగు బ్రిడ్జివద్ద మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన డీసీఎం వాహనం భైంసావైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీని ఎదురుగా ఢీకొట్టింది. అదుపుతప్పి ఎదురుగానే వస్తున్న మరో లారీనీ ఢీకొంది. ఈప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ మోహిత్‌పాల్ రెండోసారి ఢీకొట్టిన లారీ కిందపడి మృతిచెందాడు.
- ఆగస్టు 30న దిలావర్‌పూర్ మండలకేంద్రంలో ఎన్‌హెచ్ 63 భైంసా నుంచి బైక్‌పై వస్తున్న ఇద్దరు మద్యంమత్తులో ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యారు. బైక్ కిందపడి పెట్రోల్ బయటకు వచ్చి మంటలు అంటుకున్నాయి. స్థానికులు వెంటనే మంటలను ఆర్పేశారు.
- యూపీకి చెందిన బస్సు నేపాల్ ప్రయాణికులను బెంగళూర్ తీసుకెళ్తుండగా ఎన్‌హెచ్44పైనే సోమవారం వేకువజామున నిర్మల్ రూరల్ మండలం భాగ్యనగర్ వద్ద అతివేగంతో లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో డివైడర్‌కు ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది ప్రయాణికులకు గాయాలయ్యాయి.

న్యూస్‌రీల్

ఫోర్టిఫైడ్ రైస్‌తో పోషక లోపాల నివారణ

నిర్మల్‌చైన్‌గేట్: బియ్యం ఇతర ఆహార ధాన్యాల్లో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నెల్స్ కలిపి సరఫరా చేయడం ద్వారా పోషకాహార లోపం నివారించవచ్చని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన కల్పించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసే బియ్యంలో ఫోర్టిఫైడ్ బియ్యం కలపాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. 2024 నాటికి దేశ వ్యాప్తంగా బలవర్ధకమైన ఆహార ధాన్యాలు సరఫరా చేయాలని సంకల్పించిందన్నారు. దీనికోసం ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

పాదయాత్రగా పాప హరేశ్వరుని చెంతకు



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

నిర్మల్‌టౌన్: లోక కళ్యాణం కోసమే కదిలి పాప హరేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేయాలని నిర్ణయించినట్లు గండి రామన్న ఆలయ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని గండి రామన్న దత్త సాయి ఆలయం నుంచి సోమవారం మహా పాదయాత్ర చేపట్టారు. ముందుగా పూజలుచేసి కాషాయ జెండాలు చేతబూని పాదయాత్ర మొదలు పెట్టారు. ఏడేళ్లుగా శ్రావణం చివరి సోమవారం పాదయాత్రగా పాప హరేశ్వరుని దర్శనానికి వెళ్తున్నట్లు తెలిపారు.

దిలావర్‌పూర్: మండలంలోని శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయంలో ముథోల్ నియోజకవర్గ బీజేపీ నేత రామారావు పాటిల్, ఆదిలాబాద్ ప్రత్యేక కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మదాడం నవీన్, ని ర్మల్ సాయిదీక్ష సేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్‌మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మ న్ నార్వాడి భుజంగ్‌రావుపాటిల్, సంభాజీరావ్‌పాటిల్‌తోపాటు ఆయా మండలాల నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు నిర్వహించారు.


తెలుగు అకాడమీ పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో అధ్యాపకులు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలన శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భీమారావు రచించిన పాఠ్యపుస్తకాన్ని సోమవారం కళాశాలలో ఆవిష్కరించారు. డిగ్రీ ద్వితీయ సంవత్సరం ప్రభుత్వ పాలనశాస్త్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో ఈ పుస్తకాన్ని రచించారు. తెలుగు అకాడమీ ఈ పుస్తకాన్ని ముద్రించింది. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది సమక్షంలో ఈ పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్/నర్సాపూర్(జి): శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా నిర్మల్ పట్టణంలోని నగరేశ్వర శివాలయంలో, నర్సాపూర్(జి) మండలం టెంబుర్ని గ్రామంలోని స్వయంభూ శ్రీచక్రలింగేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అష్టోత్తర రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి పాలాభిషేకం చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అయ్యన్న గారి భూమయ్య, రావుల రాంనాథ్, అయ్యన్న గారి రాజేందర్, సాదం అరవింద్, అల్లం భాస్కర్, భూపాల్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సవరణల దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. హైదరాబాదు నుంచి సంయుక్త ఎన్నికల అధికారులు, ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 18, 19 సంవత్సరాలు వయసు నిండిన ప్రతీఒక్కరి వివరాలు ఓటరు జాబి తాలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలు, లింగ నిష్పత్తి వారీగా దరఖాస్తు ఫా రాలను పరిశీలించి ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఓటర్ నమోదు, ఓటరు జాబితా సవరణలకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించడంతోపాటు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుర్తింపు పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఓటరు నమోదుతోపాటు ఓటరు జాబితాలో సవరణలపై ప్రజలను చైతన్యపరిచేలా చర్యలు చేపడుతున్నామన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులను ఓటరు జాబితాలో ప్రత్యేక మార్కింగ్ చేయడం జరుగుతుందన్నారు. సమీక్షలో అదనపుకలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్వో లోకేష్, ఆర్డీవో రత్నకళ్యాణి, ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు 'తొలిమెట్టు' శిక్షణ

నిర్మల్‌రూరల్: జిల్లాలోని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు సోమవారం తొలిమెట్టు కార్యక్రమంపై జిల్లా కేంద్రంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. జిల్లా విద్యాశాఖ, రూమ్ టు రీడ్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటుచేసిన శిక్షణలో జిల్లాలోని 48 మంది కాంప్లెక్స్ హెడ్ మాస్టర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. రిసోర్స్‌పర్సన్‌లు గోపాల్, సంగీత తొలిమెట్టు కార్యక్రమం ఉద్దేశాలు, కార్యక్రమాన్ని పాఠశాలస్థాయిలో పటిష్టంగా ఎలా అమలు చేయాలో క్షుణ్ణంగా వివరించారు. పాఠశాల గ్రంథాలయాలను నిర్వహించే విధానంపై అవగాహన కల్పించారు. జిల్లా సెక్టోరియల్ అధికారి నర్సయ్య మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలో గుణాత్మక విద్య అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించిన వర్క్‌బుక్స్ (అభ్యసన పుస్తకాలు) విద్యార్థులందరూ ప్రతీరోజు రాసేలా చూడాలని సూచించారు. రూమ్ టు రీడ్ సంస్థ జిల్లా లీడ్ గోనె రవి మాట్లాడుతూ.. జిల్లాలోని 587 పాఠశాలకు గ్రంథాలయ పుస్తకాలు పంపిణీ చేశామని, విద్యార్థులు వాటిని ఉపయోగించుకునేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- ప్రజావాణికి 16 ఫిర్యాదులు

నిర్మల్‌చైన్‌గేట్: వివిధ సమస్యలతో ప్రజావాణికి వచ్చిన అర్జీదారుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి వివిధ శాఖల అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సోమవారం ప్రజావాణిలో అర్జీలు స్వీకరించారు. 16 దరఖాస్తులు అందాయి. పోడు భూములు, డబుల్ బెడ్‌రూమ్‌ఇళ్లు, ఆసరా పెన్షన్స్, భూసమస్యలు, ధరణి పెండింగ్ దరఖాస్తులపై తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించారు.



సీఐని సస్పెండ్ చేయాలని ధర్నా చేస్తున్న బాధితులు

అర్హులందరికీ 'దళితబంధు' అమలు చేయాలి

తానూరు: మండలంలోని బోల్సా గ్రామంలో అర్హులందరికీ దళితబంధు పథకం అమలు చేయాలని గ్రామస్తులు కలెక్టర్ వరుణ్‌రెడ్డిని కోరారు. ఈమేరకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సర్వే నిర్వహించకుండా లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. అధికారులు సర్వేలు నిర్వహించి అర్హులందరికీ దళితబంధు అమలు చేసేలా చూడాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఉపసర్పంచ్ భీంరావ్, సాహెబ్‌రావ్, అమృత్, అశోక్ ఉన్నారు.

ఎక్సైజ్ సీఐని సస్పెండ్ చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ ఎక్సైజ్ సీఐని సస్పెండ్ చేయాలని సమీకృత కలెక్టరేట్ ఎదుట కుంటాల మండలం అందకూర్, నిర్మల్‌రూరల్ మండలం నిలాయిపేట్ గ్రామాల ప్రజలు, గీత కార్మికులు ధర్నా చేశారు. అనంతరం అవినీతి అబ్కారి అధికారులపై చర్య తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సుంకరి శ్రీశైలంగౌడ్, కొండ మురళిగౌడ్, రాటి సాయి, దగ్గరి రాజమల్లు, మంజూర్ బాయ్, గజానంద్, ద్యగరి గంగారాజు, సల్ల సాయన్న, ప్రవీణ్, భీమేశ్ పాల్గొన్నారు.

కడెం సీఐపై..

కడెం: ఎక్సైజ్ సీఐ సంపత్‌కృష్ణపై చర్య తీసుకోవాలని మండలంలోని పాతమద్దిపడగ ఉప సర్పంచ్ రామాగౌడ్ ఒక ప్రకటనలో కోరారు.

పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చండి



కడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఐదుగురు డాక్టర్ల పోస్టులకు ఒక్కరు కూడా రెగ్యులర్ డాక్టర్ లేక ప్రజలకు వైద్యం అందడం లేదని తెలిపారు. సీహెచ్‌సీగా త్వరలో అప్‌గ్రేడ్ చేస్తామని, వారంరోజుల్లో రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి డీఎంహెచ్‌వో ధన్‌రాజ్‌ను ఆదేశించారు.

అర్హులందరికీ పోడుపట్టాలు ఇవ్వాలి

నిర్మల్‌చైన్‌గేట్: అర్హులందరికీ పోడు హక్కు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి వినతిపత్రం అందించారు. అనంతరం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నిర్మల్ జిల్లా కార్యదర్శి తొడసం శంభు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు పట్టాలిస్తానని చెప్పి అరకొరగా ఇచ్చిందన్నారు. కడెం మండలం అల్లంపల్లి గ్రామపంచాయతీ పాలరేగడ గ్రామంలో 70 మంది హక్కు పాత్రాలకు దరఖాస్తు చేసుకుంటే.. 31 మందికి మాత్రం ఇచ్చారని తెలిపారు. అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయన వెంట తొడ సం దౌలత్‌రావు, మంగం దాము, తొడసం హనుమంతరావు, పరశురాం, తులసి రామ్, కమలాబాయి, మిత్రమ సుమిత్ర, మిత్రమ రంభబాయ్, లక్ష్మీబాయి ఉన్నారు.

'సుప్రీం' తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్



సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

నిర్మల్‌చైన్‌గేట్: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ కోరారు. సమస్యలు పరిష్కరించాలనిజిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు అంగన్‌వాడీ ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు లేబర్ యాక్ట్ ప్రకారం నెలరోజుల ముందే ఐసీడీఎస్ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం ఇచ్చామన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టి ఐకేపీ వీవోఏలకు, పంచాయతీ సెక్రెటరీలకు అప్పజెప్పడం అన్యాయమన్నారు. తమ డిమాండ్లునెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసచారి, అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయూ అనుబంధం జిల్లా అధ్యక్షుడు ఏ.రాజమణి, బి.లలిత, శైలజ, విజయ, దేవిక, సరోజ, చిన్నగంగవ్వ, అరుణ, అనురాధ నాయకులు పాల్గొన్నారు.

అటవీ అమరవీరుల త్యాగాలను మరువొద్దు



గండిరామన్న హరితవనంలో నివాళులర్పిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

- బాసర సర్కిల్ సీసీఎఫ్ శర్వానన్

నిర్మల్‌టౌన్/సారంగపూర్: అటవీ అమరవీరుల త్యాగాలను ఎవరు మరువొద్దని బాసర సర్కిల్ అటవీశాఖ సీసీఎఫ్ శర్వానన్ యాదవ్ అన్నారు. నిర్మల్ పట్టణ శివారులోని చించోలి(బీ) అర్బన్‌పార్క్‌లో, సారంగపూర్ మండలం చించోలి(బి) గ్రామ సమీపంలోని గండిరామన్న హరితవ నంలో సోమవారం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. అమరవీరుల స్తూపం నివాళులర్పించారు. అటవీ సంపదను కాపాడేందుకు విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టిన అమరవీరులకు జోహార్లు అంటూ నినదించారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరించారు. అనంతరం శర్వానన్ మాట్లాడుతూ.. వ్యప్రాణులను రక్షించుకోవడంతోపాటు అడవులను సంరక్షించే క్రమంలో ఎంతోమంది అమరులయ్యారన్నారు. అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, ప్రకృతి ప్రసాదించిన సంపదను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమాల్లో డీఎఫ్‌వో రాంకిషన్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పోలీస్ రక్షణ

నిర్మల్‌టౌన్: జిల్లాలోని ప్రతీ పౌరుడికి పోలీస్ రక్షణ ఉంటుందని ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లా వాట్సాప్ నంబర్ 8712659599 కు అయినా సమాచారం ఇవ్వాలని తెలిపారు.



అర్జీదారు సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

ఖానాపూర్ ఠాణాను తనిఖీ చేసిన డీఎస్పీ

ఖానాపూర్: ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌ను నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని ఎస్సైలతో నెలవారీ క్రైం రివ్యూ నిర్వహించారు. పెండింగ్ కేసులపై ఆరాతీసి విచారణను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడారు. గణేశ్ ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా పీస్ కమిటీ సమావేశాలు, రూట్‌మ్యాప్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గతనెల 30న నమోదైన అట్రాసిటీ కేసు విషయమై బాధితులను పిలిపించి పోలీ స్‌స్టేషన్‌లో విచారణ చేశారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వారి సమస్యలు తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. సీఐ మోహన్, ఎస్సైలు ఆర్.శంకర్, రజినీకాంత్, కె.రాజు ఉన్నారు.



క్రైం రివ్యూలో మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

సమైక్యత దినోత్సవానికి అతిథులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సెప్టెంబర్ 17న 'తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం'కు జిల్లా కేంద్రాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించేందుకు రాష్ట్రం ప్రభుత్వం అతిథులను ఖరారు చేసింది. నిర్మల్‌కు మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లాకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, కుమురంభీం జిల్లా కు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ సుంకరి రాజు, మంచిర్యాలకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌ను కే టాయించింది. ఆ రోజు ఉదయం 9గంటలకు జి ల్లా కేంద్రాల్లో జాతీయ పతాకాన్ని ఎగరవేయనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతికుమారి ఆదేశాలు ఇచ్చారు.

క్లుప్తంగా

అదుపుతప్పి కారు బోల్తా



బోల్తా పడిన కారు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి దంతన్‌పల్లికి చెందిన కారు మత్తడిగూడ నుంచి ఉట్నూర్ వైపు వెళ్తుండగా అదుపుతప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఘటనలో ఎవరికీ గాయాలు కాకుండా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై ఎస్సై మనోహర్‌కు వివరణగా కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతామన్నారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఆయా విభాగాల్లో ఇవ్వనున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, ఏర్పోర్టు క్యాంపస్ ఆధ్వర్యంలో యువకులకు వెల్డింగ్, డ్రైవాల్/ఫాల్ సీలింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రీషియన్, రిఫ్రిజిరేటర్ / ఎయిర్ కండీషన్, బైక్ మెకానిక్ కోర్సుల్లో, యువతులకు నాగారం, సిరిసిల్ల క్యాంపస్‌లో హోమ్ హెల్త్ ఎయిడ్ కోర్సుల్లో మూడునెలల పాటు ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ నెల 13న ఉదయం 10 గంటలకు ఉట్నూర్ కేబీకాంప్లెక్స్ ప్రాంగణంలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల లోపు ఉండి ఎస్ఎస్‌సీ పాస్ లేదా ఫెయిల్, ఐటీఐ లేదా డిప్లొమా ఎలక్ట్రికల్ విద్యార్హత ఉన్నవారు అర్హులన్నారు.

పీచరలో చిరుత పులి సంచారం..!



పాదముద్రలు పరిశీలిస్తున్న ఎఫ్‌బీవో

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామ శివారులో సోమవారం ఉదయం చిరుతపులి సంచరించినట్లు పుకార్లు రావడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. సర్పంచ్ బుర్రి లత అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఎఫ్‌బీవో రమేశ్, ఆనిమల్ ట్రాకర్ సంజీవ్ పులి పాదముద్రలు సేకరించారు. వాటిని పరిశీలించి ఇవి చిరుత పులివి కావని, హైనావని నిర్ధారించడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

చిరుత పులి కాదు.. నక్కే

సోన్: మండలంలోని న్యూవెల్మల్, బొప్పారం గ్రామాల్లోని పంటచేలలో పనిచేస్తున్న రైతులకు సోమవారం చిరుతపులి కనిపించిందని భయాందోళనకు గురయ్యారు. పాద ముద్రలను పరిశీలించిన పొన్కల్ డెప్యూటీ ఎఫ్ఆర్‌వో నజీర్‌ఖాన్ ఇవి నక్కల పాదముద్రలని, ఎవరూ భయాందోళనకు గురికావద్దని సూచించారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎవరెస్ట్ వైపు తొలి అడుగు..

- పర్వతారోహణ శిక్షణకు కార్తీక్
- ఈ నెల 15న సిక్కింకు పయనం..
- ఎవరెస్ట్, కిలిమంజారో పర్వతాలు ఎక్కేందుకు మార్గం సుగమం
- సాహస కృత్యాలతోపాటు కళల్లో రాణిస్తున్న కుమురంభీం జిల్లా యువకుడు



ఇచ్చోడలో నిర్వహించిన పోటీల్లో క్లైంబింగ్ చేస్తున్న కార్తీక్ (ఫైల్)



తల్లిదండ్రులతో కార్తీక్

కెరమెరి(ఆసిఫాబాద్): ఆశయ సాధనకు పేదరికం అడ్డుకాదని నిరుపిస్తున్నాడు.. కుమురంభీం జిల్లా కెరమెరి మండలం కెలి కె గ్రామానికి చెందిన గిత్తే కార్తీక్. సాహస కృత్యాల్లో రాణిస్తూనే, మరోవైపు కళల్లోనూ తన ప్రతిభను చూపుతున్నాడు. తన గమ్యం ఎవరెస్ట్ అధిరోహించడమే అని చెబుతున్న కార్తీక్.. తాజాగా సిక్కిం రాష్ట్రంలో నిర్వహించే పర్వతారోహణ శిక్షణకు ఎంపికయ్యాడు.

తెలంగాణ నుంచి ఐదుగురు..

కెలి కె గ్రామానికి చెందిన గిత్తే రుక్మాజీ, ఇటాబాయిల కుమారుడు కార్తీక్ ప్రస్తుతం మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లోని మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. సిక్కింలోని నామ్‌చా జిల్లాలో ఈనెల 18 నుంచి అక్టోబర్ 16 వరకు విద్యార్థులకు పర్వతారోహణ శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణకు తెలంగాణ నుంచి ఐదుగురు ఎంపిక కాగా.. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి కార్తీక్ ఒక్కరే ఉన్నారు. నెల రోజులపాటు కొనసాగే ఈ కఠినమైన శిక్షణ పూర్తయితే ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వతం ఎవరెస్ట్‌తోపాటు కిలిమంజారో వంటి శిఖరాలు అధిరోహించేందుకు అనుమతి లభిస్తుంది. ఈ నెల 15న సిక్కింకు బయలుదేరనున్నాడు. కాగా కార్తీక్ ఇప్పటికే బోనగిరిలోని రాక్‌లైన్ స్కూల్ ఆధ్వర్యంలో జూన్ 19న బోనగిరి గుట్టపై 150 ఫీట్ల రాపెల్లింగ్, 150 ఫీట్ల క్లైంబింగ్‌తోపాటు 650 ఫీట్ల ఎత్తు వరకు ట్రెక్కింగ్ పూర్తి చేశారు. 30 ఫీట్ల బౌల్ ట్రింగ్, 10 మీటర్ల జిప్‌లైన్‌లోనూ ప్రతిభ చూపాడు. దీంతో బోనగిరి రాక్‌లైన్ స్కూల్ ఆధ్వర్యంలో సి క్యాంప్‌లో అందించే శిక్షణకు ఎంపికయ్యాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కలెక్టర్ హేమంత్ బోర్కడే రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు.

మాలావత్ పూర్ణ స్ఫూర్తి

> 13 ఏటనే ఏడు పర్వతాలు అధిరోహించిన నిజామాబా ద్ జిల్లాకు చెందిన మాలా వత్ పూర్ణను స్ఫూర్తిగా తీసుకుని సాహస కృత్యాల్లో పాల్గొంటున్నా. ట్రెక్కింగ్, క్లైంబింగ్‌తోపాటు కవితలు రాయడం, చెస్ ఆడటం అంటే ఇష్టం. పేదరికంతో ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. ఆర్థికంగా అండగా ఉంటే రాష్ట్రం పేరు నిలబెడతా..
>
> – గిత్తే కార్తీక్

ఇతర కళల్లోనూ నేర్పరి

సాహస కృత్యాలతోపాటు కార్తీక్ ఇతర కళల్లోనూ నేర్పరి. పాఠశాల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పలు పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడు. వజ్రోత్సవం సందర్భంగా జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కవి సమ్మేళనంలో మొదటిస్థానంలో నిలిచాడు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోటీల్లో పతకం సాధించాడు. ఇచ్చోడలో జరిగిన వాటర్‌ఫాల్ పోటీల్లోనూ పాల్గొని సత్తా చాటాడు. గతంలో నేపాల్‌లో జరిగిన చెస్ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాగా ప్రజాప్రతినిధులు, అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆర్థికసాయం అందించి ఆదుకున్నారు.



కవిత పోటీల్లో సన్మానం పొందుతున్న కార్తీక్

సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



అర్జీలు స్వీకరిస్తున్న చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ప్రజావాణికి వచ్చే అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పింఛన్, రెండు పడక గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌ఓ కుమ్రబాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, ఆర్‌సీవో గంగాధర్, జేడీఎం నాగభూషణం, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు



శాలువాతో సత్కరిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో సోమవారం దేవదాయ శాఖ స్థపతి వల్లి నయాగం మెస్రం వంశీయులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణం, అభివృద్ధి, నాగోబా జాతర నిర్వహణ, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి నాగోబా ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, మెస్రం వంశీయులు మెస్రం చిన్నుపటేల్, మెస్ర బాదిరావ్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఎదుట అంగన్‌వాడీల ఆందోళన



సమ్మెలో కూర్చున్న అంగన్‌వాడీలు

ఉట్నూర్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెన్షన్ ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని, ప్రమాద బీమా రూ.5 లక్షలు చెల్లించాలని, ఎస్ఎస్‌సీ అర్హత ఉన్న హెల్పర్లకు ప్రమోషన్ కల్పించాలని, జీపీఎస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి రత్నమాల, ముక్త, పద్మ, సంగీత, కవిత, లక్ష్మి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. అంగన్‌వాడీలు సమ్మె బాట పట్టడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు తొలగించి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారుల సమక్షంలో కేంద్రాల్లో నిలువ ఉన్న గుడ్లు, పప్పు తదితర సరుకుల వివరాలను నమోదు చేసుకుని వేరే వారికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది.

రిమ్స్‌లో రోగి ఆత్మహత్యాయత్నం

- భయంతో పరుగులు తీసిన రోగులు



ఫ్యాన్ ఆపుతున్న షిండే బాలాజీ

ఆదిలాబాద్‌టౌన్: మానసిక స్థితి బాగాలేని ఓ రోగి రిమ్స్‌లో ఆత్మహత్యకు యత్నించడం తీవ్ర కలకలం రేపింది. ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన షిండే బాలాజీకి కడుపు ఉబ్బసం, ఒక కాలు కదలిక లేకపోవడంతో కుటుంబ సభ్యులు నాలుగు రోజుల క్రితం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా సీఓటీ మెడిసిన్‌లో చికిత్స పొందుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం బెడ్‌పై నుంచి ఒక్కసారిగా లేచి నిలబడి చేతికి ఉన్న సెలైన్ తీసి పారేశాడు. తిరుగుతున్న ఫ్యాన్‌ను చేతితో ఆపి ఫ్యాన్ రెక్కలతో తన మెడను కోసుకున్నాడు. సెలైన్ పెట్టే స్టాండ్లను రెండు చేతులతో పట్టుకుని హంగామా చేశాడు. వార్డులో చికిత్స పొందుతున్న మరో ఐదు గురు రోగులు భయాందోళనకు గురై చేతికున్న సెలైన్లతోనే బయటకు పరుగులు తీశారు. సెక్యూరిటీ గార్డులు పట్టుకుని బెడ్‌కు కట్టేశారు. విషయం తెలుసుకున్న రిమ్స్ డైరెక్టర్ సైక్రియాట్రిస్ట్ ఓం ప్రకాష్‌ను పిలిచి కౌన్సిలింగ్ ఇప్పించారు. అయితే బాలాజీ చికిత్స పొందుతున్న బెడ్ పక్కనున్న మరో రోగికి ఆపరేషన్ చేసి పడుకోబెట్టడంతో తనకెక్కడ ఆపరేషన్ చేస్తారోననే భయంతో ఇలా చేసినట్లుగా అతని భార్య లక్ష్మి తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసగించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: రెండేళ్లుగా ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌లో జూనియర్ ఆర్టిస్ట్ ఇన్ ఫిల్మ్ ఇండస్ట్రీస్‌కు చెందిన పాటిదార్ రూపకు ఆదిలాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన తొళ్ల ప్రవీణ్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో ఒకే గదిలో కలిసి ఉంటున్నారు. ఇటీవల ప్రవీణ్ నీవు నాకు నచ్చడంలేదని, వేరే వారిని వివాహం చేసుకోవాలని ఫోన్‌లో చెప్పాడు. దీంతో రూప సోమవారం మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: పోలీస్ అధికారులపై దాడి చేసిన కేసులో నిర్మల్ కోర్టు ఇద్దరికీ రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించినట్లు కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపారు. లోకేశ్వరం పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నరేందర్ ఆగస్టు 30, 2021న కనుకపూర్ గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం కుల బహిష్కరణ జరిగిన విషయంపై పోలీసులు గ్రామస్తులతో మాట్లాడుతుండగా దాసరి రవి, నక్కరాజన్న వారిని నెట్టివేసి రాళ్లతో కొట్టేందుకు యత్నించారు. దీనిపై హెడ్‌కానిస్టేబుల్ నరేందర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై బాలకృష్ణ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.రమణారావు 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో ఇద్దరికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజేష్ కుమార్ సోమవారం తీర్పునిచ్చారు.

అతివేగం... ఆపై నిద్రమత్తు

- లారీని ఓవర్‌టేక్ చేయబోయి ప్రైవేటు బస్సు బోల్తా
- ఎనిమిది మందికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



బోల్తాపడిన ప్రైవేట్ బస్సు

నిర్మల్‌రూరల్: అతివేగం... ఆపై నిద్రమత్తుతో ఓ లారీని ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పిన ప్రైవేటు బస్సు బోల్తా పడిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై చంద్రమోహన్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... ఉత్తరప్రదేశ్‌లోని రూపాదియా జిల్లా నుండి 19 మంది నేపాల్ వాసులను తీసుకుని బెంగళూర్‌కు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు మండలంలోని భాగ్యనగర్ గ్రామ శివారు వద్ద జాతీయ రహదారి ఎన్‌హెచ్ 44 పై లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తా పడింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 8 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. డ్రైవర్ వెంటనే అక్కడి నుండి పరారయ్యాడు. స్థానికులు గమనించి 108, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గాయపడిన ప్రయాణికులను జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ వినోద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

మహాలక్ష్మి ఆలయంలో చోరీ



తాళం పగులగొట్టిన హుండీ

కుభీర్: మండలంలోని దార్‌కుభీర్ గ్రామంలో ఉన్న మహాలక్ష్మి ఆలయంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం రాత్రి ఆలయ హుండీని పగులగొట్టి అందులోని నగదు అపహరించాడు. ఆలయ గర్భగుడి తాళం పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. ఘటనలో సుమారు రూ.2 లక్షల సొత్తు చోరీకి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై ఏఎస్సై శివయ్యను ప్రశ్నించగా ఇంత వరకు ఫిర్యాదు రాలేదన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచిన అధికారులు



భీంపూర్‌లో తాళం తీస్తున్న అధికారులు

తాంసి(బోథ్): నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు కేంద్రాలను మూసివేసి సోమవారం సమ్మెలో పాల్గొన్నారు. ఐసీడీఎస్ అధికారులు భీంపూర్ మండలంలోని భీంపూర్, పిప్పల్‌కోటి, నిపాని, తాంసి మండలంలోని తాంసి, గిరిగాం, అంబుగాం, పొన్నారి తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచుల సమక్షంలో తెరిచారు. తాత్కాలిక సిబ్బంది ద్వారా కేంద్రాలను యథావిధిగా నడిపేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో భీంపూర్ సూపర్‌వైజర్ ముంతాజ్, తాంసి సూపర్‌వైజర్ సుజాత, సర్పంచ్‌లు లింబాజీ, గంగయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇదేమి ‘ఉన్నతి’



సరిపడా కుర్చీలు లేక డైట్ ఆవరణలో టీచర్లు

- శిక్షణ కేంద్రంలో సౌకర్యాలు కరువు
- ఇబ్బందులకు గురైన టీచర్లు

ఆదిలాబాద్‌టౌన్: ఉన్నత పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు కూర్చునేందుకు కనీసం కుర్చీలు లేకపోవడంతో శిక్షణ కేంద్రంతో పాటు కళాశాల ఆవరణలో కాలయాపన చేశారు. నాలుగు సబ్జెక్టులకు సంబంధించి శిక్షణ ఏర్పాటు చేయగా డైట్‌లో సరిపడా గదులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. ఇదివరకు జిల్లా కేంద్ర సమీపంలోని విద్యార్థి, వివేకానంద బీఎడ్ కళాశాలల్లో శిక్షణ ఏర్పాటు చేయగా ఉపాధ్యాయులకు కొంత దూరంగా ఉంటుందని డైట్ కళాశాలకు మార్చారు. అయితే ఇందులో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శిక్షణ కొనసాగుతోంది. ఈ క్రమంలో శిక్షణ పొందుతున్న ఛాత్రోపాధ్యాయులను తరగతి గదుల నుంచి బయటకు పంపించి టీచర్లకు అక్కడ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించా రు. దీంతో ఛాత్రోపాధ్యాయులు కళాశాల ఆవరణ లో కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయ మై శిక్షణ కోఆర్డినేటర్ కంటె నర్సయ్యను వివరణ కోరగా ఇదివరకు నిర్వహించిన శిక్షణ కేంద్రాల్లో విద్యుత్ సమస్య ఉండడంతో ఇక్కడికి మార్చామన్నారు.

విద్యార్థులకు ‘శిక్ష’ణ..!

- శిక్షణ కేంద్రానికి కుర్చీలు మోయించిన గురువులు



కుర్చీలు మోస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు మరింత నాణ్యమైన బోధన జరిగేలా ప్రభుత్వం ఉపాధ్యాయులకు ‘ఉన్నతి’ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టగా అది కాస్తా విద్యార్థులకు ‘శిక్ష’గా మారింది. డైట్ కళాశాలలో నిర్వహించిన ఉన్నతి శిక్షణ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు సరిపడా కుర్చీలు అందుబాటులో లేకపోవడంతో ఎన్టీవో పాఠశాల నుంచి పదిమంది విద్యార్థులను పిలిపించి పక్కనే ఉన్న గదిలో నుంచి కుర్చీలు మోయించారు. అటెండర్లు ఉన్నప్పటికీ విద్యార్థుల చేత కుర్చీలు మోయించడం విమర్శలకు దారి తీసింది.

పాపహరేశ్వరుని చెంత భక్తుల కోలాహలం



ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

దిలావర్‌పూర్(నిర్మల్): జిల్లాలోని అత్యంత ప్రాచీన ప్రాశస్త్యం గల కదిలి అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీమాతన్నపూర్ణ పాపహరేశ్వరాలయంలో సోమవారం భక్తుల కోలాహలం నెలకొంది. శ్రావణమాసంలో చివరి సోమవారం కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అభిషేకం, అన్నపూజ, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్రావు పాటిల్ తెలిపారు. అంబుగాం గ్రామానికి చెందిన దిగంబర్ పాటిల్ భక్తులకు అన్నదానం చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపారు.

కాలినడకన ఆలయానికి..

నిర్మల్ సాయిదీక్షా సేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో 300కు పైగా భక్తులు నిర్మల్ పట్టణంలోని గండిరామన్న దత్తసాయి ఆలయం నుండి 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాపహరేశ్వరాలయానికి కాలినడకన తరలివచ్చారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని పంజాబ్ చౌక్‌లో బేల మండలంలోని ఏటి గ్రామానికి చెందిన షేక్ సల్మాన్(36) ఈనెల 9న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పంజాబ్ చౌక్‌లో పురుగుల మందు తాగి పడి ఉన్నాడు. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై జీవీ రమణారెడ్డి తెలిపారు.

మార్కెట్లో ‘పొలాల’ సందడి





జిల్లాలో పొలాల అమావాస్య వేడుకల నిర్వహణకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈ వేడుకల్లో భాగంగా బసవన్నలను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేయనున్నారు. అలంకరణకు అవసరమైన సామగ్రిని సోమవారం ఇంద్రవెల్లి, బేల మండల కేంద్రంలోని దుకాణాల్లో వ్యాపారులు అందుబాటులో ఉంచారు. వాటిని కొనుగోలు చేస్తున్న రైతులతో మార్కెట్‌లో సందడి వాతావరణం నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్, ఇంద్రవెల్లి





సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీతం 18K, ఫోన్ : 9963114535, 7287061111

[HA-189330]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462